# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీని నెరవేరుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు.
- ❖ ఎన్డీయే కూటమి ప్రభుత్వం తెలుగు కళా వైభవాన్ని పునరుద్ధరిస్తోందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.
- ❖ అకాల వర్షాల నేపథ్యంలో వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ.. రైతులను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
- ❖ "జీరో వేకెన్సీ" పాలసీ కింద ఆసుపత్రుల్లోని ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

====================

యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన చేస్తామని ఇచ్చిన హామీని నెరవేరుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఉగాది వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఉద్యోగాల కల్పన కోసం సంకల్పించి, 10 వేల 60 ఉద్యోగాలను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్ విడుదల చేశామన్నారు. 15 వేల 940 మంది టీచర్లకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించామని, 5 వేల 757 మంది పోలీసు కానిస్టేబుళ్ల నియామకాలు చేశామని చెప్పారు. 30 వేల 607 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేటు రంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం మే 15 నుంచి అక్టోబరు 15 వరకూ నోటిఫికేషన్లు ఇచ్చి ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్.. వెల్దీ, హెల్దీ, హ్యాపీ సొసైటీగా మారాలంటే అన్ని రంగాల్లోనూ ముందుండాలని, పరాభవ నామ సంవత్సరంలో తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిచెప్పేలా సంకల్పం చేద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

(వాయిస్ 41 సెకన్లు)

====================

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా వ్యవసాయ పంటలకు జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈదురు గాలులు, వడగళ్ళ కారణంగా ఇప్పటివరకు జరిగిన పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణా, నెల్లూరు, శ్రీ సత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 89 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచనాలను ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం 1,215 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 2 వేల 43 మంది రైతులకు నష్టం వాటిల్లిందని వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. పూర్తిస్థాయిలో పంట నష్టం వివరాలు సేకరించాలని, వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇస్తూ అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

====================

రానున్న 3, 4 రోజుల్లో రాష్ట్రంలో వడగళ్ళతో కూడిన అకాల వర్షాలతో పాటు ఈదురు గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు అత్యవసర సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జ్ కమిషనర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ప్రభావం ఉండే అవకాశముందని మంత్రి తెలిపారు. అరటి, మామిడి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని త్వరితగతిన నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

====================

వైద్య సేవలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రుల్లోని ఖాళీలను "జీరో వేకెన్సీ" పాలసీ కింద ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన 20 నెలల్లో మొత్తం 2 వేల 53 వైద్యుల పోస్టుల భర్తీ చేపట్టినట్టు పేర్కొన్నారు. ఇవికాక.. 5 వేల 800 మంది పారా మెడికల్, 1,200 మంది ఆశావర్కర్ల పోస్టులను కూడా భర్తీ చేశామని చెప్పారు. త్వరలోనే బోధన ఆసుపత్రుల అవసరాల కోసం 317 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ జరగనుందని వెల్లడించారు. పోస్టుల భర్తీ ద్వారా ప్రభుత్వంపై ప్రతి సంవత్సరం 350 కోట్ల రూపాయల ఆర్థిక భారం పడుతుందని మంత్రి వివరించారు.

విరామం

====================

తెలుగు పండుగలు ప్రకృతి ఆరాధనకు, ఆరోగ్యకర జీవన విధానానికి ప్రతీకలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆయన ఈరోజు ప్రారంభించి, సహచర మంత్రులతో కలిసి పంచాంగ శ్రవణం, తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఉగాది పచ్చడి మన జీవితాలను ప్రతిబింబిస్తుందన్నారు. షడ్రుచుల లాగే మన జీవితంలో కష్టసుఖాలు, సుఖ దుఃఖాలు కలగలిసి ఉంటాయని చెప్పారు. గోదావరి పుష్కరాలను నిర్వహించే అవకాశం తనకు మూడవ సారి దక్కిందన్నారు. నీటిని పరిరక్షించేలా నీటి భద్రత విధానాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఉగాది సందర్భంగా పేదలకు సాయం అందించే దస్త్రంపై ముఖ్యమంత్రి సంతకం చేశారు. 6 వేల 787 మందికి ఆర్థిక సాయం అందించేలా 55.63 కోట్ల రూపాయల సీఎంఆర్ఎఫ్ నిధులను విడుదల చేశారు.

====================

కూటమి ప్రభుత్వం తెలుగు కళా వైభవాన్ని పునరుద్ధరిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విజయవాడలో ఈరోజు జరిగిన పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొని

మాట్లాడుతూ... భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా కవులు, కళాకారులు, రచయితలకు సమున్నత గౌరవం అందిస్తున్నామన్నారు. గతంలో నిలిపివేసిన కందుకూరి పురస్కారాలు, ఉగాది పురస్కారాలను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. దశాబ్దాలుగా గుర్తింపునకు నోచుకోని కోనసీమ ప్రభల తీర్థాన్ని అధికారిక పండుగగా గుర్తించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్  తీరప్రాంతం, యానాం, పరిసర ప్రాంతాలపై  ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి తమిళనాడు మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు ఉన్న నిన్నటి ద్రోణి సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో అనేక చోట్ల ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని, ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించింది.

====================

కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో సుపరిపాలన అందిస్తోందని బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వర క్షేత్రాన్ని ఆయన ఈరోజు కుటుంబ సమేతంగా సందర్శించారు. దేవస్థానం అధికారులు కేంద్రమంత్రికి ఘనస్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పరమేశ్వరుని కోరుకున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లోను పురోగమిస్తోందన్నారు.

====================

====================